అధ్యాయం 3

# గర్భాశయ ముఖ ద్వారంలో....

# క్యాన్సర్ ఆనవాళ్లను పట్టించే పరీక్షలు (VIA, VILI) – నిర్వహణ మరియు శిక్షణ

(A Practical Manual on Visual Screening for Cervical Neoplasia)

## లూగోల్ అయొడిన్ ద్రావణంతో పరీక్ష నిర్వహణ, ఫలితాల మదింపు….

### పరీక్ష కోసం అవసరమైన పరికరాలు, ఇతర సామాగ్రి

- మహిళను పడుకోబెట్టి పరీక్ష చేయడానికి అనువైన బల్ల (టేబుల్). మోకాళ్లు ముడిచి, కాళ్లను సౌకర్యంగా పెట్టుకోవడానికి అనువైన ఏర్పాటు ఉండాలి.
- ప్రకాశవంతమైన వెలుగును ప్రసరించే దీపం. హాలోజెన్ లైటు లేదా టార్చి మేలు. గర్భాశయ ముఖ ద్వారాన్ని నేరుగా, ప్రకాశవంతంగా చూడటానికి వీలవుతుంది.
- శుద్ధి చేసిన స్పెక్యులమ్; కస్కోస్ గ్రేవ్స్ (Cusco's Grave's) లేదా కొలిన్స్ (Collin's)
- ఒక జత చేతి తొడుగులు (Gloves)
- దూది ఉండలు, దూది చుట్టిన పుల్లలు, ఒత్తిడిని తెలియజేసే గేజ్ పరికరం, ముందు భాగం వృత్తాకారంలో రింగ్ ఫోర్సెప్స్, వస్తువుల్ని పట్టి తీసేందుకు ఉపకరించే పికప్ ఫోర్సెప్స్
- తాజాగా తయారు చేసిన 5 శాతం లూగోల్ అయొడిన్ ద్రావణం
- చేతి తొడుగుల్ని ముంచి ఉంచడానికి వీలుగా 0.5 శాతం విలీన క్లోరిన్ ద్రావణంతో నింపిన స్టీలు లేదా ప్లాస్టిక్ పాత్ర
- పరికరాల్ని శుద్ధి చేయడానికి, శుభ్రపరచడానికి వీలుగా 0.5 శాతం విలీన క్లోరిన్ ద్రావణాన్ని నింపిన ప్లాస్టిక్ బకెట్ లేదా పాత్ర
- వాడిన దూది ఉండల్ని, ఇతర వ్యర్థాల్ని పడేయడానికి వీలుగా పాలిథీన్ సంచితో చుట్టబడిన ప్లాస్టిక్ బకెట్

### లూగోల్ అయొడిన్ ద్రావణం తయారీ

100 ఎంఎల్ పరిశుద్ధమైన నీటిలో 10 గ్రాముల పొటాషియం అయొడైడ్ ని కలపండి. పొటాషియం అయొడైడ్ పూర్తిగా కరిగిపోయాక, 5 గ్రాముల అయొడిన్ నుకలపండి. అయొడిన్ పూర్తిగా కరిగిపోయేదాకా మెల్లగా కలియ తిప్పండి. ఈ ద్రావణం ఆవిరి అవకుండా, రసాయనిక క్రియా శీలత తగ్గకుండా ఉండేందుకు వీలుగా ఒక పాత్రలో ఉంచి గట్టిగా మూత బిగించి భద్రపర్చండి.

## పరీక్ష నిపుణులు- నైపుణ్యాలు

గర్భాశయ ముఖ ద్వార నిర్మాణం, శారీరక ధర్మాలు, రోగ లక్షణాలపైన పరీక్ష నిపుణులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలి. కంటితో నిశితంగా పరిశీలన చేసినపుడు నిరపాయకరమైన మార్పుల్ని, వాపు, క్యాన్సర్ ముందుస్తు లక్షణాలు, ఆనవాళ్లని, ప్రమాదకరమైన క్యాన్సర్ ను పసిగట్టే నేర్పును కలిగి ఉండాలి.

## పరీక్ష విధానం

పరీక్ష కోసం సిద్ధమైన మహిళలకు పరీక్ష పద్ధతి, విధానం గురించి వివరంగా తెలియ చెప్పాలి. పరీక్షకు ముందుగానే లిఖిత పూర్వక అనుమతి పత్రాన్ని తీసుకోవాలి. అనుబంధం 2 లో లిఖిత పూర్వక అనుమతి పత్రం నమూనాను పొందుపరచడం జరిగింది. సదరు మహిళ ప్రసూతి, స్త్రీ వ్యాధుల గత చరిత్రను అనుబంధం 3 లో పొందుపరచబడిన నమూనా పత్రాన్ని అనుసరించి నమోదు చేసి భద్రపర్చాలి. పరీక్ష విధానం బాధాకరంగా ఉండదని హామీ ఇవ్వాలి. పరీక్ష సమయంలో మహిళ ఎలాంటి ఆందోళన లేకుండా విశ్రాంతిగా ఉండేలా చూడాలి.

పరీక్ష నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాక మహిళను లోపలికి రమ్మని పిలవాలి. బల్లపైన నెమ్మదిగా మోకాళ్లను మడిచి పడుకోమని చెప్పాలి. కాళ్లను విశ్రాంతిగా ఉంచడానికి బల్ల మీద ప్రత్యేక ఏర్పాటు ఉంటుంది. కాళ్లను వాటిపై ఆనించి ఉంచాలి. పరీక్ష చేయడానికి అనువుగా మహిళ సర్దుకుని పడుకున్నాక యోని నుంచి ఏవైనా స్రావాలు విడుదల అవుతున్నాయోమో పరిశీలించండి. జననాంగం బాహ్య ప్రాంతాలు, మలద్వారం వరకూ ఉన్న భాగాల్లో ఏవైనా గాయాలు, దెబ్బలు, వాపు, ముతక పొక్కులు, గుల్లలు, దద్దుర్లు, పుండ్లు, వ్రణాలు, పులిపిర్లు ఉన్నాయోమో చూడండి. గజ్జలు, తొడల భాగాల్లో వాపు ఉందేమో పరిశీలించండి. యోని భాగం నుంచి మలద్వారం వరకూ దూది ఉండతోగానీ లేదా యాంటీ సెప్టిక్ ద్రావణంలో ముంచిన గాజుగుడ్డతోగానీ శుభ్రంగా తుడవండి.

ఆ తర్వాత వేడి నీళ్లలో మరిగించి బాగా శుద్ధి చేసిన స్పెక్యులమ్ ని యోనిలోని మృదువుగా ప్రవేశ పెట్టండి. స్పెక్యులమ్ బ్లేడ్లని నెమ్మదిగా తిప్పుతూ వెళ్లండి. గర్భాశయ ముఖ ద్వారం స్పష్టంగా కనిపించేంత వరకూ బ్లేడ్లను తిప్పి ఆ తర్వాత వాటిని అక్కడ గట్టిగా బిగించండి. యోని, గర్భాశయ ముఖ ద్వారాన్ని ప్రకాశవంతంగా చూడటానికి వీలుగా దీపాన్ని సర్దుబాటు చేసుకోండి. ఇపుడు గర్భాశయ ముఖ ద్వారం పరిమాణాన్ని, ఆకారాన్ని, ఆకృతిని పరిశీలించండి. గర్భాశయ ముఖద్వారం బాహ్య రంధ్రాన్ని,

బాగా ఎరుపు రంగులో కనిపించే కోలుమ్నార్ ఎపిథీలియంను, గులాబీ రంగులో కనిపించే స్క్వామస్ ఎపిథీలియంను, ఈ రెండు పొరలు కలిసే స్క్వామో కోలుమ్నార్ కూడలిని గుర్తించండి. తర్వాత స్క్వామో కోలుమ్నార్ కూడలి కారణంగా ఏర్పడే ట్రాన్స్‌ఫార్మేషన్ జోన్ పై సరిహద్దుని గుర్తించండి. గర్భాశయ ముఖద్వారంలో కనిపించే అసాధారణ మార్పులు, అసాధారణ వృద్ధి అంతా ఈ ట్రాన్స్ ఫార్మేషన్ జోన్ లోనే జరుగుతుందని గుర్తుంచుకోండి.

గర్భాశయ ముఖ ద్వార ప్రాంతంలో ఎక్ట్రోపియాన్ అంటే కనుబొమల అంచులు తిరగబడినట్లుగా ఉండే ఆకృతి ఏమైనా కనిపిస్తోందేమో చూడండి. సర్వైకల్ పాలిప్, నబోథియాన్ సిస్ట్ లు, గర్భాశయ ముఖద్వారం అంచుల మీద మానిపోయిన గాయాల తాలూకు అవశేషాలు, మందపాటి తెలుపు మచ్చలు, కాండిలోమేటా ఇంకా సర్విసైటిస్ తాలూకు లక్షణాలేమైనా కనిపిస్తున్నాయో పరిశీలించండి. వయసుతోపాటు స్క్వామస్ ఎపిథీలియం పొరలో క్షీణత కారణంగా మెనోపాజ్ దాటిన మహిళల్లో గర్భాశయ ముఖద్వారం చాలా బలహీనంగా, పెళుసుగా మారి ఉండటాన్ని మీరు గమనించవచ్చు. విడుదల అవుతున్న స్రావాలు, వాటి రంగు, మందం, పరిమాణం, వాసన తదితర అంశాల ఆధారంగా రోగ లక్షణాలను అంచనా వేయడానికి ప్రయత్నించండి. గర్భాశయ ముఖ ద్వారం నుంచి సన్నటి దారపు పోగును తలపించే స్రావం విడుదల అవడం అండోత్పత్తిని సూచిస్తుంది. గర్భాశయ ముఖ ద్వారం నుంచి అధిక రక్తస్రావం జరుగుతున్నపుడు ఆ మహిళ నెలసరిలో ఉందని అర్థం. ఇలాంటపుడు VILI పరీక్షను ఆపేయాలి. నెలసరి పూర్తయ్యాక 5 నుంచి 15 రోజుల మధ్యలో మళ్లీ పరీక్షకు రమ్మని చెప్పాలి.

గర్భాశయ ముఖద్వారం ఎక్ట్రోపియాన్ ప్రాంతంలో ఎక్కువ భాగం, గర్భాశయ ముఖ ద్వార బాహ్య రంధ్రం చుట్టూరా ఉండే ప్రాంతం, బాహ్య రంధ్రానికి దూరంగా ఉండే స్క్వామో కోలుమ్నార్ కూడలి భాగాలన్నీ మనకు ఎర్రటి ఎరుపుతో కనిపిస్తుంటాయి. నబోథియాన్ సిస్ట్ లు చూడ్డానికి బుడిపెల్లాగా నీలం తెలుపు కలిసిన రంగులోగానీ, పసుపు తెలుపు కలిసిన రంగులోగానీ కనిపిస్తుంటాయి. ఈ బుడిపెలు లేదా కణుపుల్ని కప్పుతూ మృదువైన మెత్తటి పొర ఉంటుంది. ఈ పొర శాఖోపశాఖలుగా విస్తరించిన రక్త నాళాలకు అనుసంధానమై ఉంటుంది. కొంతమంది మహిళల్లో నబోథియాన్ సిస్ట్ ల పరిమాణం బాగా పెద్దగా ఉంటుంది. ఇలాంటపుడు గర్భాశయ ముఖ ద్వార ఆకృతిలో కూడా తేడాలు కనిపిస్తుంటాయి.

గర్భాశయ ముఖ ద్వార కండరం చూడ్డానికి ఎర్రటి ఎరుపు లేదా లేత గులాబీ రంగులోగానీ కనిపిస్తుంది. సర్వైకల్ కెనాల్ వెనక భాగం నుంచి పొడుచుకు వచ్చిన మెత్తటి మాంసపు ముద్దలాగా ఉంటుంది. కొన్నిసందర్భాల్లో నిర్జీవమైన కండను తలపిస్తూ సర్వైకల్ క్యాన్సర్ సోకిందేమోనన్న భ్రమనూ కలిగిస్తుంది. గర్భాశయ ముఖ ద్వారం బాహ్య రంధ్రం అంచుల వద్ద మానిపోయిన గాయాల తాలూకు అవశేషాల కారణంగా ఒక్కోసారి సర్విక్స్ బాహ్య రంధ్రం ఆకృతిలో తేడాలు కనిపిస్తుంటాయి. ల్యూకోప్లేకియా కారణంగా గర్భాశయ ముఖ ద్వార ప్రాంతంలో తెల్లటి మందపాటి మచ్చలు ఏర్పడుతుంటాయి. వీటి ఉపరితం చాలా మెత్తగా, మృదువుగా ఉంటుంది. గోకడం లేదా ఇతరత్రా మార్గాల ద్వారా ఈ తెలుపు మచ్చల్ని తొలగించడానికి వీలుపడదు. స్క్వామస్ ఎపిథీలియంలోని ట్రాన్స్ ఫార్మేషన్ కూడలిలోనూ, కూడలికి బయటా... ఆకుపచ్చ తెలుపు రంగుతో కూడిన ప్రదేశాలు కనిపించడాన్నిసర్వైకల్ కాండిలోమేటాగా అర్థం చేసుకోవాలి. ఇలాంటి మార్పులే యోని, జననాంగ భాగాల్లో కూడా కనిపిస్తుంటాయి.

గర్భాశయ ముఖ ద్వార ప్రాంతంలో చిన్న చిన్న నీటి బుగ్గలు, పుండ్లు ఉన్నాయోమో చూడండి. సర్వైకల్ ఇన్ఫెక్షన్ సోకినపుడు గర్భాశయ ముఖ ద్వారం వద్ద ఎర్రటి ఎరుపు, వాపుతో కూడిన ప్రదేశాలు విస్తృతంగా కనిపిస్తాయి. చాలా సందర్భాల్లో వాపు యోని వరకూ వ్యాపించి ఉంటుంది. సర్విక్స్ ని తాకినపుడు రక్తస్రావం జరుగుతుందేమో గమనించండి. పుండు పడినపుడు, అది విస్తరిస్తున్నపుడు తాకితే రక్తస్రావం జరుగుతుంది. క్యాన్సర్ సోకిన తొలినాళ్లలో గర్భాశయ ముఖ ద్వార ఉపరితలం అంతా గరకుగా, ఎర్రగా మారుతుంది. ఇలాంటపుడు ఆ భాగాన్ని ముట్టుకుంటే రక్తస్రావం జరుగుతుంది. క్యాన్సర్ ముదిరిన దశలో క్యాన్సర్ కణజాలం సర్విక్స్ భాగాన్ని కబళించి బయటకు పెరుగుతుంది. ఇలా బయటకు విస్తరిస్తోన్న కణజాలం నుంచి తేలికగా రక్తస్రావం జరుగుతుంది. ముట్టుకుంటే రక్తస్రావం జరగడం, కణజాలం నిర్జీవంగా మారడం ఈ రెండు లక్షణాలు సర్వైకల్ క్యాన్సర్ లో ప్రధానంగా కనిపిస్తాయి. ఇన్ఫెక్షన్ కారణంగా విడుదలయ్యే స్రావాలు కూడా చెడు వాసన వేస్తుంటాయి. అపక్రమంగా ఉబ్బి కనిపించే సర్విక్స్ వెనక అపుడపుడూ హానికరమైన క్యాన్సర్ కూడా కారణంగా ఉంటుంది. గర్భాశయ ముఖ ద్వారాన్ని కంటితో నిశితంగా పరిశీలించినపుడు గమనించిన మార్పుల్ని జాగ్రత్తగా రాసి పెట్టండి.

ఇపుడు అయొడిన్ ద్రావణంలో ముంచిన దూది ఉండతో గర్భాశయ ముఖ ద్వారం మీద నెమ్మదిగా అద్దండి. మహిళ దుస్తుల మీదగానీ, మీ దుస్తుల మీదగానీ అయొడిన్ ద్రావణం పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి. దూది ఉండని తొలగించిన తర్వాత గర్భాశయ ముఖ ద్వారాన్ని పరిశీలించండి. అయొడిన్ ద్రావణాన్ని గ్రహించని ప్రదేశాలు ఏమైనా కనిపిస్తున్నాయో చూడండి. అయొడిన్ ని గ్రహించని ప్రదేశాలు చూడ్డాని పాలిపోయినట్లుగా, లేత గులాబీ రంగులోగానీ, పసుపు కలిసిన తెలుపు రంగులోగానీ కనిపిస్తాయి. ముఖ్యంగా స్క్వామో కోలుమ్నార్ కూడలికి దగ్గరగా ఉండే ట్రాన్స్ ఫార్మేషన్ కూడలిలో ఇలాంటి ప్రదేశాలు ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. పరీక్ష పూర్తయిన తర్వాత యోని భాగాలు, గోడలపైన మిగిలిన అయొడిన్ ద్రావణాన్ని పొడిగా ఉండే దూది ఉండలతో శుభ్రంగా తుడిచేయండి.

## పరీక్ష ముగింపు

పరీక్ష కోసం ఉపయోగించిన కలుషిత దూది ఉండల్ని, గేజ్ ని, ఇతర వ్యర్థాల్ని ప్లాస్టిక్ బకెట్ లో ఉంచిన ప్లాస్టిక్ బ్యాగులోకి పారబోయండి. స్పెక్యులమ్ పరికరాన్ని మృదువుగా బయటకు తీయండి. యోని గోడలపైన ఎక్కడైనా కాండిలోమా, ఎసిటో వైట్ గాయాలు, పుండ్లు ఉన్నాయోమో చూడండి.

చేతి తొడుగుల్ని తీసేయడానికి ముందు 0.5 శాతం విలీన క్లోరిన్ ద్రావణం ఉన్న పాత్రలో కాసేపు చేతుల్ని ముంచి ఉంచి ఆ తర్వాత తొడుగుల్ని తొలగించండి. కలుషితం కాకుండా ఉండేందుకు ప్లాస్టిక్ బకెట్ లో ఉన్న విలీన క్లోరిన్ ద్రావణంలో పది నిమిషాల పాటు  చేతి తొడుగుల్ని ముంచి ఉంచండి.  0.5 శాతం విలీన క్లోరిన్ ఆమ్లం తయారీ గురించి అనుబంధం 4 లో వివరించబడింది.

VILI పరీక్ష కోసం ఉపయోగించిన స్పెక్యులమ్, ఇతర పరికరాల్ని 0.5 శాతం విలీన క్లోరిన్ ద్రావణంలో కనీసం పది నిమిషాల పాటైనా ముంచి ఉంచండి. తర్వాత సబ్బుతోనూ, నీటితోనూ శుభ్రం చేయండి. శుభ్రం చేసిన పరికరాలు, ఇతర సామాగ్రిని మళ్లీ పరీక్ష కోసం ఉపయోగించడానికి ముందు 20 నిమిషాలపాటు బాగా మరుగుతున్న నీటిలో ఉడికించి శుద్ధి చేయాలి. లేదా ఆటోక్లేవ్ యంత్రంలో పరికరాల్ని శుద్ధి చేయాలి. ఆ తర్వాతే పరీక్షకు వాడుకోవాలి.

## పరీక్ష ఫలితాల్ని పొందుపర్చడం, మహిళకు సలహా ఇవ్వడం


అనుబంధం 3 లో ఇవ్వబడిన నమూనా పత్రం ఆధారంగా VILI పరీక్ష ఫలితాల్ని జాగ్రత్తగా పొందుపర్చండి. పరీక్షలో గుర్తించిన, కనుగొన్న మార్పుల్ని, పరిశీలనల్ని మహిళలకు అర్థమయ్యేలా తెలియ చెప్పండి. తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించండి. పరీక్షలో అంతా బాగుందని తేలినపుడు ఎలాంటి సమస్యా లేదని మహిళకు హామీ ఇవ్వండి. ఐదేళ్ల తర్వాత మరొకసారి పరీక్ష చేయించుకోమని సూచించండి. పరీక్షలో సమస్యలు ఉన్నాయని గుర్తించినపుడు మరిన్ని పరీక్షలు చేయాల్సి ఉంటుందని తెలియ చెప్పండి. గర్భాశయ ముఖ ద్వారం మీద గాయాలు, పుండ్లను కచ్చితంగా నిర్ధారించుకునేందుకు, అవసరమైన వైద్యం కోసం కాల్పోస్కోపీ, బయాప్సీ పరీక్షలు చేయాల్సి ఉంటుందని వివరించండి. గర్భాశయ ముఖ ద్వారంలో హానికరమైన క్యాన్సర్ ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్న అనుమానం ఉన్నపుడు... క్యాన్సర్ల నిర్ధారణతోపాటు తగిన వైద్యాన్ని అందించే కేంద్రాలు, ఆస్పత్రులకు వెళ్లాల్సిందిగా సదరు మహిళకు సూచించండి.

## అయొడిన్ ద్రావణంతో పరీక్ష (VILI) నెగటివ్ (-)

అయొడిన్ ద్రావణంతో పరీక్ష చేసినపుడు కింద కనిపించిన మార్పుల్లో ఏ ఒక్కటి కనిపించినా పరీక్షను నెగటివ్ గా పేర్కొనండి.


- ఆరోగ్యవంతమైన సాధారణ గర్భాశయ ముఖ ద్వారం- స్క్వామస్ ఎపిథీలియం పొర ముదురు గోధుమ రంగులోగానీ లేదా నలుపు రంగులో గానీ కనిపించడం, కోలుమ్నార్ ఎపిథీలియం పొరలో ఎలాంటి రంగు మార్పూ కనిపించకపోవడం (చిత్రం 3.2).
- రంగు మార్పు లేకుండా లేదా పాక్షికంగా గోధుమ రంగులోని మారిన ప్రదేశాలు గజిబిజిగా, చెదురుమదురుగా కనిపించడం (చిత్రాలు 3.3-3.6).
- గర్భాశయ ముఖ ద్వార పాలీప్స్ మీద రంగు మార్పు లేని లేదా పాక్షికంగా అయొడిన్ ను స్వీకరించిన ప్రదేశాలు కనిపించడం. (చిత్రం 3.7).
- ట్రైకోమోనాలిస్ వెజైనాలిస్ ఇన్ఫెక్షన్ (T. Vaginalis) కారణంగా చిరుతపులి చర్మం మీద కనిపించే మచ్చల్లాంటివి కనిపించడం (చిత్రం 3.8).
- స్క్వామో కోలుమ్నార్ కూడలికి దూరంగా ఉండే స్క్వామస్ ఎపిథీలియంలో అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు చూడ్డానికి మిరియపు గింజలను తలపిస్తూ మచ్చల్లాగా కనిపించడం. (చిత్రం 3.9).

- అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు స్క్వామో కోలుమ్నార్ కూడలికి సుదూరంగా పల్చగా, పసుపు రంగులో కోణీయ ఆకారాల్లో భూభాగాల ఆకృతులను పోలినట్లుగా కనిపించడం (చిత్రం 3.10).




చిత్రం- 3.1:

అయొడిన్ ద్రావణంతో గర్భాశయ ముఖ ద్వారాన్ని కంటితో పరిశీలించడం (VILI).



స్క్వామస్ ఎపిథీలియం
అయొడిన్ ను గ్రహించని కోలుమ్నార్ ఎపిథీలియం

చిత్రం- 3.2:

వీలీ పరీక్ష (VILI) నెగటివ్: అయొడిన్ ద్రావణం ఉపయోగించిన తర్వాత నలుపు రంగులోకి మారిన స్క్వామస్ ఎపిథీలియం. ఎలాంటి రంగు మార్పూ లేని కోలుమ్నార్ ఎపిథీలియం



.
చిత్రం- 3.3:

వీలీ పరీక్ష (VILI) నెగటివ్: గర్భాశయ ముఖ ద్వారం మీద, ట్రాన్స్ ఫార్మేషన్ కూడలికి బయటా అక్కడక్కడా, చెల్లాచెదురుగా కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు. ఈ ప్రదేశాలు గర్భాశయ ముఖ ద్వార వాపుకు సంకేతాలు.




చిత్రం- 3.4:

వీలీ పరీక్ష(VILI) నెగటివ్: చెల్లాచెదురుగా కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు (సన్నటి బాణపు గుర్తులు). అయొడిన్ ను గ్రహించిన ప్రదేశాలను చూపుతోన్న మందపాటి బాణపు గుర్తులు.




చిత్రం- 3.5:

విలీ పరీక్ష(VILI) నెగటివ్:  అయొడిన్ ద్రావణం ఉపయోగించిన తర్వాత కూడా ఇంకా గోధుమ రంగులో కనిపిస్తోన్న స్క్వామస్ ఎపిథీలియం. ట్రాన్స్ ఫార్మేషన్ కూడలిలో చెల్లాచెదురుగా కనిపిస్తోన్న పాక్షికంగా అయొడిన్ ను గ్రహించిన ప్రదేశాలు. ఇవి స్క్వామస్ ఎపిథీలియంలో అసాధారణ మార్పుల్ని, వాపును సూచిస్తాయి.



చిత్రం- 3.6:

విలీ పరీక్ష(VILI) నెగటివ్: చెల్లాచెదురుగా కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు (సన్నటి బాణపు గుర్తులు). అయొడిన్ ను గ్రహించిన ప్రదేశాలను చూపుతోన్న మందపాటి బాణపు గుర్తులు.




చిత్రం- 3.7:


విలీ పరీక్ష(VILI) నెగటివ్: పాలిప్ మీద చెల్లాచెదురుగా కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు (సన్నటి బాణపు గుర్తులు). పాక్షికంగా అయొడిన్ ను గ్రహించిన ప్రదేశాలను చూపుతోన్న మందపాటి బాణపు గుర్తులు. నలుపు రంగులో కనిపిస్తోన్న స్క్వామస్ ఎపిథీలియం.



చిత్రం- 3.8:
వీలీ పరీక్ష(VILI) నెగటివ్: గర్భాశయ ముఖ ద్వారం మీద, ట్రాన్స్ ఫార్మేషన్ కూడలికి బయటా అక్కడక్కడా, చెల్లాచెదురుగా కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు. ఈ లక్షణాలు సర్విసైటిస్ కు సంకేతాలు.



చిత్రం- 3.9:
వీలీ పరీక్ష(VILI) నెగటివ్: గర్భాశయ ముఖ ద్వారంలో వాపు, పుండు పడటం కారణంగా స్క్వామస్ ఎపిథీలియం లో మిరియపు గింజల్ని తలపించేలా కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు.



చిత్రం- 3.10:
వీలీ పరీక్ష(VILI) నెగటివ్: అయొడిన్ నెగటివ్. స్క్వామో కోలుమ్నార్ కూడలి నుంచి వేరుపడి, విభిన్నంగా పసుపు రంగులో కనిపిస్తోన్న ప్రదేశాలు. శాటిలైట్ లీజన్స్



చిత్రం- 3.11:
వివీ పరీక్ష(VILI) పాజిటివ్: స్క్వామో కోలుమ్నార్ కూడలి సరిహద్దు ప్రాంతంలో గర్భాశయ ముఖ ద్వారం వెనక (anterior lip) కాషాయ పసుపు రంగులో కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని ప్రదేశం.



చిత్రం- 3.12:
వివీ పరీక్ష(VILI) పాజిటివ్:
స్క్వామో కోలుమ్నార్ కూడలిని తాకుతూ గర్భాశయ ముఖ ద్వారం వెనక (anterior lip) ఆవాలు పసుపు కలిసిన రంగులో కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని పుండు భాగం.

**అయొడిన్ పరీక్ష (VILI) – పాజిటివ్ (+)**

స్క్వామో కోలుమ్నార్ కూడలికి దగ్గరగా ఉండే ట్రాన్స్ ఫార్మేషన్ కూడలిలోగానీ, లేదా స్క్వామో కోలుమ్నార్ కూడలి కనిపించని పరిస్థితుల్లో గర్భాశయ ముఖ ద్వార బాహ్య రంధ్రానికి దగ్గరగానీ(Figures 3.11-3.15), లేదా గర్భాశయ ముఖ ద్వారం ప్రాంతం అంతటా (Figure 3.16) అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు దట్టంగా, మందంగా, ప్రకాశవంతంగా ఆవాలు పసుపు రంగులోగానీ లేదా కాషాయం పసుపు రంగులోగానీ కనిపిస్తున్నపుడు VILI పరీక్షను పాజిటివ్ గా భావించాలి.


**VILI పరీక్ష పాజిటివ్- ప్రమాదకరమైన క్యాన్సర్**

అయొడిన్ ద్రావణంతో పరీక్ష జరిపినపుడు గర్భాశయ ముఖ ద్వారం అంతా పుండులాగా కనిపిస్తుంది. అసాధారణంగా వృద్ధి చెందిన క్యాన్సర్ కణుపులు, వివిధ ఆకృతుల్లో విభిన్నంగా దట్టమైన పసుపు రంగులో కనిపిస్తుంది. (చిత్రాలు 3.17-3.19).


## పరీక్ష నిపుణుల స్వీయ మూల్యాంకనం

లూగోల్ అయొడిన్ ద్రావణ పరీక్షలో కనిపించిన పాజిటివ్ ఫలితాల్ని పరీక్ష నిపుణులు తదుపరి దశల్లో కాల్పోస్కోపీ, హిస్టాలజీ పరీక్షల ఫలితాలతో పోల్చి చూసుకోవాలి. డాక్టర్లతో కలిసి కాల్పోస్కోపీ పరీక్షల నిర్వహణ, ఫలితాల మదింపులో తప్పనిసరిగా పాల్గొనాలి. ఇది పరీక్షల నిర్వహణ, నైపుణ్యాలను పెంపొందిస్తుంది.

పరీక్ష నిపుణులు తమ సొంత నైపుణ్యాలను అంచనా వేసుకోవడానికి ఒక బెంచ్ మార్క్ ఉంది. VILI పరీక్షలో ఎంతమంది మహిళల్ని ఎసిటో పాజిటివ్ గా నిర్ధారిస్తున్నారు? వారిలో ఎంతమంది క్యాన్సర్ బాధితులుగా తేలారన్న విషయాన్ని బట్టి పరీక్ష నిపుణుల సొంత నైపుణ్యాల్ని అంచనా వేసుకోవచ్చు. సమర్థత, నైపుణ్యం కలిగిన పరీక్ష నిపుణులు సాధారణంగా VILI పరీక్షలో 10 నుంచి 15 శాతం మంది మహిళల్ని విలీ పాజిటివ్ గానూ, వారిలో 20 నుంచి 30 శాతం మందిని క్యాన్సర్ బాధితులుగా గుర్తించగలుగుతారు.




చిత్రం-3.13:
విలీ పరీక్ష(VILI) పాజిటివ్:
స్క్వామో కోలుమ్నార్ కూడలి సరిహద్దు భాగంలో గర్భాశయ ముఖ ద్వారం వెనక (anterior lip) ఆవాలు పసుపు కలిసిన రంగులో కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని పుండు భాగం.




చిత్రం- 3.14:

విలీ పరీక్ష(VILI) పాజిటివ్: గర్భాశయ ముఖ ద్వారం వెనక (anterior lip) స్క్వామో కోలుమ్నార్ కూడలి సరిహద్దులో దట్టమైన ఆవాలు,పసుపు కలిసిన రంగులో రకరకాల ఆకృతులు, ఆకారాల్లో కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని ప్రదేశాలు.




చిత్రం- 3.15:

విలీ పరీక్ష(VILI) పాజిటివ్: గర్భాశయ ముఖ ద్వారం కింద, పైనా, సర్వైకల్ కెనాల్ లోకి విస్తరించి, బాగా మందంగా, ఆవాలు పసుపు కలిసిన రంగులో కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని విశాలమైన ప్రదేశాలు.




చిత్రం- 3.16:

విలీ పరీక్ష(VILI) పాజిటివ్: గర్భాశయ ముఖ ద్వారం నలువైపులా, సర్వైకల్ కెనాల్ లోకి విస్తరించి, బాగా దట్టంగా, కాషాయం పసుపు కలిసిన రంగులో కనిపిస్తోన్న అయొడిన్ ను గ్రహించని విశాలమైన ప్రదేశాలు. వీటి ఉపరితలం అపక్రమంగా, గరకుగా ఉంటుంది.



చిత్రం- 3.17:


విలీ పరీక్ష(VILI) పాజిటివ్ మరియు ప్రమాదకరమైన క్యాన్సర్: గర్భాశయ ముఖ ద్వారం అంతటా బాగా విస్తృతంగా, దట్టంగా, మందంగా ఆవాలు పసుపు కలిసిన రంగులో పుండు పడి కనిపిస్తోన్న ప్రదేశం. ఉపరితల ఆకృతి అంతా కణుపులతో కూడి, గరకుగా ఉంటుంది. గర్భాశయ ముఖ ద్వారం బాహ్య రంధ్రం కప్పబడిపోయింది.



చిత్రం- 3.18:

విలీ పరీక్ష(VILI) పాజిటివ్ మరియు ప్రమాదకరమైన క్యాన్సర్:

గర్భాశయ ముఖ ద్వారం అంతటా బాగా విస్తృతంగా, దట్టంగా, మందంగా ఆవాలు పసుపు కలిసిన రంగులో పుండు పడి కనిపిస్తోన్న ప్రదేశం. ఉపరితల ఆకృతి అంతా కణుపులతో కూడి, గరకుగా ఉంటుంది. ప్రమాదకరమైన క్యాన్సర్ కు సంకేతం.



చిత్రం- 3.19:

విలీ పరీక్ష(VILI) పాజిటివ్ మరియు ప్రమాదకరమైన క్యాన్సర్: గర్భాశయ ముఖ ద్వారం అంతటా బాగా విస్తృతంగా, దట్టంగా, మందంగా ఆవాలు పసుపు కలిసిన రంగులో పుండు పడి కనిపిస్తోన్న ప్రదేశం. ఉపరితల ఆకృతి అంతా కణుపులతో కూడి, గరకుగా ఉంటుంది.

.... అయిపోయింది...